క్లుప్తంగా

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి: నియోజకవర్గంలో శుక్రవారం జరిగే పలు కార్యక్రమాల్లో మంత్రి ఆర్‌కే రోజా పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు నగరి మండలం బుగ్గఅగ్రహారం ఆదిఆంధ్రవాడలో నూతనంగా నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఆమె ప్రారంభిస్తారు. అనంతరం నిండ్ర మండలం ఎలకాటూరులో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే పుత్తూరు మండలం కృష్ణసముద్రంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు.

వైఎస్సార్ బీమా అందజేత


బీమా సాయం అందిస్తున్న వైస్ చైర్మన్

నగరి: మున్సిపల్ పరిధిలోని సత్రవాడ–2 సచివాలయ పరిధిలోని మంజుల అనే మహిళ అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతిచెందింది. ఆమెకు వైఎస్సార్ బీమా చేయించి ఉండడంతో రూ.లక్ష మంజూరైంది. ఆమెకు నామినీ అయిన భర్త భూపతికి గురువారం తక్షణ సాయం కింద రూ.10 వేలను వైస్ చైర్మన్ బాలన్ అందించారు.

గుర్తింపు కార్డులు ఇవ్వండి


వినతిపత్రం అందిస్తున్న కళాకారులు

పుత్తూరు రూరల్: పుత్తూరు మండలంలోని వివిధ కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాల్సిందిగా గురువారం తహసీల్దార్ జె.పరమేశ్వరస్వామికి స్థానిక ప్రజానాట్య మండలి నాయకులు వినతిపత్రం అందజేశారు. మండలి గౌరవాధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ మహిళా కోలాటం, చెక్క భజనల కళాకారులు మండలంలో పదుల సంఖ్యలో ఉన్నారని, వీరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కళాకారుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు ఇచ్చిన ఆఖరు తేదీ అక్టోబర్ 6వ తేదీని పొడిగించాలని కోరారు.

గిఫ్ట్ బాక్స్ విజేతలు వీరే..!


లక్కీ డిప్‌ను తీస్తున్న విక్రమ్

పుత్తూరు రూరల్: పుత్తూరు ఆర్టీసీ డిపోలో నూతనంగా ప్రారంభించిన గిఫ్ట్ స్కీమ్ విజేతలను గురువారం డిపో మేనేజర్ ప్రశాంతి ప్రకటించారు. ప్రశాంతి మాట్లాడుతూ పుత్తూరు ఆర్టీసీ డిపో బస్సుల్లో ప్రయాణించిన వారు తమ టికెట్ వెనుక భాగంలో తమ పేరు, సెల్ నంబర్‌ను రాసి పుత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. ప్రతి నెలా 5వ తేదీన విజేతలను ప్రకటించి, బహుమతులు అందజేస్తామని తెలిపారు. తొలి నెల విజేతలకు స్పాన్సర్ చేసిన స్థానిక శారద టెక్స్‌టైల్స్ యజమాని కె.బి.విక్రమ్ లక్కీ డిప్‌ను తీశారు. టి.చిట్టిబాబు, ఆర్.షకీల్, ఎ.సత్య విజేతలుగా ప్రకటించారు. వీరికి సమాచారం అందించి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఫేస్‌బుక్ పోస్టులతో అగౌరవ పరిస్తే జైలుకే!

పలమనేరు: ఫేస్‌బుక్‌లో ఇష్టానుసారంగా పోస్టులు పెట్టి అగౌరవ పరిస్తే జైలుకు పంపిస్తామని పలమనేరు సీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఫేస్‌బుక్ లో ఫేక్ ఖాతాలను తెరిచి రాజకీయ నాయకులు, మహిళలను అగౌరపరుస్తూ పోస్టులు చేస్తున్నారంటూ ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారను. అలాంటి మెసేజ్‌లు పెట్టే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. వారిపై సెక్షన్ 153–ఏ, 67–ఏ ఐటీ చట్టం కింద జైలుకు పంపిస్తామన్నారు. ఇటీవల కొందరిపై తప్పుడు పోస్టులు పెట్టారనే ఫిర్యాదు మేరకు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు.

సేవా దృక్పథం ఉండాలి


విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందిస్తున్న ఎన్నారై ధనుంజయరెడ్డి

శ్రీరంగరాజపురం: ప్రతిఒక్కరు సేవా దృక్పథం అలవర్చుకోవాలని ఎన్నారై ధనంజయరెడ్డి అన్నారు. మండలంలోని ములూరు గ్రామంలో వెలసిన శ్రీ ఇరుగాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇరగాలమ్మ ఆలయ అభివృద్ధి కమిటీ తరఫున ఏటా నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు విద్యాసామగ్రిని అందిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఆలయ కమిటీ సభ్యులు బీటెక్ చదువుతున్న పేద విద్యార్థి ప్రీతి గుర్తించి ఎన్నారై ధనుంజయరెడ్డి ఆర్థిక సహకారంతో ఉచితంగా ల్యాప్‌టాప్ అందజేశారు. అలాగే గతంలో 10వ తరగతి బాలికలకు 50 సైకిళ్లను ఉచితంగా అందించడంతో పాటు ములూరు ఎస్టీ కులానికి చెందిన 10 మంది విద్యార్థులు అమెరికాలో ఎంఎస్ చేసేందుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులురెడ్డి, సురేంద్రరెడ్డి, నోమేష్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఇరగమరెడ్డి, ద్రాక్షాయణి, వనజ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ప్రదాత సీఎం జగన్

- ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించాం
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి


డిప్యూటీ సీఎం నారాయణస్వామిని గజమాలలతో సత్కరిస్తున్న నాయకులు

శ్రీరంగరాజపురం: సంక్షేమ పథకాల ప్రదాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం ఆయన మండలంలోని కలికిరిండ్లు, ఇందిరాకాలనీ, ఆర్కేవీబీపేట, ఆర్కేవీబీపేట దళితవాడ, రాజుల కండ్రిగ గ్రామాల్లో సర్పంచ్ దివ్య, వైస్ ఎంపీపీ మణెమ్మ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమ కోసం సీఎం జగనన్న పెద్దపీట వేశారన్నారు. డ్వాక్రా మహిళలకు విడతల వారీగా సున్నావడ్డీ, రుణమాఫీ అమలు చేస్తున్నామని, వైఎస్సార్ చేయూత ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 45–60 ఏళ్లలోపు ఉన్న మహిళలకు ఏటా రూ.18,750 వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. కాపునేస్తం ద్వారా రూ.15 వేలు, ఈబీసీ నేస్తం పథకం ద్వారా అగ్రవర్ణాల్లో ఉన్న పేదలకు రూ.15 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్న ఘనత కూడా జగనన్నకే దక్కుతుందన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వాలు తమలాంటి పేదలను పట్టించుకోలేదని, కానీ జగనన్న సీఎం అయ్యాక కులం, మతం, రాజకీయాలకు అతీతంగా పథకాలను అందిస్తూ తమకు లబ్ధి చేకూరుస్తున్నారని కొనియాడారు. కలికిరి ఇండ్లు గ్రామంలో కొందరు తమకు ఇళ్లు లేవని మంత్రి దృష్టికి తీసుకురాగా, స్పందించిన ఆయన వెంటనే వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసి గృహ నిర్మాణాలు చేపట్టేలా చూడాలని తహసీల్దార్ రవికుమార్‌ను ఆదేశించారు. అలాగే ఇందిరా కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ఇబ్బంది పడుతున్నట్లు మహిళలు చెప్పడంతో స్పందించిన మంత్రి సీసీ రోడ్లతో పాటు, డ్రైనేజీ నిర్మాణానికి ఎంత ఖర్చు అయినా సరే వెంటనే ప్రణాళిక సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గ్రామంలో విద్యుత్ తీగలు ఇళ్లపైనే ఉన్నాయని చెప్పడంతో విద్యుత్ ఎస్ఈతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే ఇందిరా కాలనీలో విద్యుత్ తీగలను తొలగించి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే ఆర్కేవీబీ పేట గ్రామంలో కూడా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. అనంతరం రాజుల కండ్రిగ గ్రామంలో ఇళ్ల స్థలాలు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని పలువురు కోరడంతో వెంటనే అర్హులైన వారిని గుర్తించి వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.


మంత్రిపై పూలవర్షం కురిపిస్తున్న మహిళలు

అడుగడుగునా హారతులతో స్వాగతం..

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి గ్రామాల్లో అడుగడుగునా మహిళలు మంగళ హారతులు పట్టి స్వాగతం పలికారు. అదే విధంగా ఇందిరా కాలనీలో మంత్రి నారాయణస్వామిని జిల్లా కార్యదర్శి గోపి, చలపతి, జ్యోతి, మాజీ ఎంపీటీసీ అన్నపూర్ణమ్మ, గోవిందస్వామి గజమాలలతో ఘనంగా సన్మానించారు. ఆర్కేవీబీపేట గ్రామంలో సర్పంచ్ దివ్య, దుష్యంత్, లోకనాథరెడ్డి గజమాలలతో స్వాగతం పలికారు. రాజుల కండ్రిగ గ్రామంలో వైస్ ఎంపీపీ మణెమ్మ, రామూర్తి, మణి, భారతి మంత్రికి గజమాలలు వేశారు. కార్యక్రమంలో మంత్రి నారాయణ స్వామి కుమార్తె కృపాలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, సోముశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, చిన్నబ్బరెడ్డి, మురళి, జయరామ్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, జేసీఎస్ పురంధర్, చందురాజు, కృష్ణయాదవ్, శేషాద్రి, అమీద్, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఏడీఈ నాగరాజు పలువురు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు రుణపడి ఉంటాం


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ మునిరాజులు

శ్రీరంగరాజపురం: మండలంలోని ముద్దుకుప్పం దళితవాడ గ్రామంలో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ గిరిబాబు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో తమ గ్రామానికి రోడ్డు వేయాలని అప్పటి పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించిన దాఖలు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవ తీసుకుని తమ పంచాయతీలోని గ్రామాలకు సీసీ రోడ్లు, రూ.19 లక్షలతో దిగువ ముద్దుకుప్పం గ్రామానికి తారురోడ్డు, నూతన ఆలయం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్తగా 3 బోర్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్, లైబ్రరీ మంజూరు చేస్తానని, ముద్దుకుప్పం పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దామని మంత్రి హామీ ఇచ్చారన్నారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ మునిరాజులు, పంచాయితీ కార్యదర్శి కోదండరెడ్డి, ఇంజినిరింగ్ అసిస్టెంట్ గుణ, నాయకులు శీనయ్య, మునిరత్నంరెడ్డి, చెంగల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీ గడువు పెంపు

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేడ్కర్ ఓపెన్ డిగ్రీ అడ్మిషన్ల గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కోఆర్డినేటర్ టి.నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఓపెన్ ఇంటర్ పాసైన వారు, ఐటీఐ రెండేళ్ల కోర్సు పాసైన వారు, డిప్లొమో పాసైన వారు డిగ్రీకి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు స్వయంగా యూనివర్సిటీ పోర్టల్ www.bsoauonline.in ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని చెప్పారు. ద్వితీయ, తృతీయ ఏడాది విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించడానికి ఈనెల 20వ తేదీ ఆఖరి గడువు అని తెలిపారు. వివరాలకు 9515401088లో సంప్రదించాలని కోరారు.

సీఎంసీకి వెళ్లి పింఛను అందజేత


రాణిపేట సీఎంసీ ఆస్పత్రిలో గుండయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్

పాలసముద్రం: గంగాధర నెల్లూరు దళితవాడకు చెందిన గుండయ్య రాణిపేట సీఎంసీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసి గురువారం వలంటీర్ దీర్ఘ సొంత డబ్బులతో ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందించింది. దీంతో బాధితుడు గుండయ్య ఆనందం వ్యక్తం చేశాడు. ఈ ప్రభుత్వం తమలాంటి నిస్సహాయులకు ఎంతో ఉంటోందని తెలిపాడు.

పక్క రాష్ట్రానికి వెళ్లి పింఛన్ అందజేత


పింఛన్ అందజేస్తున్న వలంటీర్ పొన్నమ్మ

పుత్తూరు రూరల్: పుత్తూరు మున్సిపాలిటీ 8వ వార్డు దాసరిగుంట సచివాలయ వలంటీర్ వి.పొన్నమ్మ గురువారం తమిళనాడు జీహెచ్‌కు వెళ్లి పింఛను పంపిణీ చేశారు. తన పరిధిలోని పింఛను లబ్ధిదారురాలు కె.ధనలక్ష్మి అనారోగ్యంతో గత కొద్ది రోజులుగా చెన్నై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ 110 కిలో మీటర్లు ప్రయాణించి వెళ్లి వితంతు పింఛన్ నగదు అందించారు.

నేడు డయల్ యువర్ ఈఓ

తిరుమల : తిరుమల అన్నమయ్యభవన్‌లో శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ ఈఓ కార్యక్రమం నిర్వహించనున్నట్లు టీటీడీ వెల్లడించింది. ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం కానున్న ఈ కార్యక్రమం ద్వారా శ్రీవారి భక్తులు తమ సందేహాలు, సూచనలను టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డికి నేరుగా తెలియజేయవచ్చని పేర్కొంది. భక్తులు 0877-2263261 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించింది.

10 నుంచి వేమన పద్య పఠన పోటీలు

తిరుపతి కల్చరల్ : వేమన పద్యానికి పట్టాభిషేకం పేరిట ఈనెల 10వ తేదీ నుంచి వేమన పద్య పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధి మల్లారపు నాగార్జున తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. మూడు విభాగాలు ఈ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. 1 నుంచి 3వ తరగతి విద్యార్థులకు వేమన పద్య పఠనం మాత్రమే ఉంటుందని, 4,5,6వ తరగతుల వారు పద్యంతోపాటు భావం కూడా చెప్పాలని తెలిపారు. 7,8,9 తరగతి విద్యార్థులు వేమన పద్య పఠనం, భావం చెప్పటంతో పాటు రాయాల్సి ఉంటుందని వివరించారు. విజేతలకు తిరుపతిలో ఫైనల్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 10న రేణిగుంట జెడ్పీ హైస్కూల్, 11న పచ్చికాపల్లంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, 12న పుత్తూరు ఎస్ఆర్ఎస్ ఉన్నత పాఠశాల, తిరుపతిలోని ఎంజీఎం ఉన్నత పాఠశాలలో పోటీలు ఉంటాయని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. పేదలకు వరం


వైద్యసేవలు పొందిన వారితో రామ్‌ప్రసాద్ రెడ్డి


కళ్లద్దాలు అందుకున్న వృద్ధులతో రామ్‌ప్రసాద్‌రెడ్డి

– మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి/పుత్తూరురూరల్: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తోందని మంత్రి రోజా సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. గురువారం నగరి మండలంలోని గుండ్రాజుకుప్పం, వడమాలపేట మండలం పాదిరేడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శిబిరంలో అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత పటిష్టంగా అమలు చేస్తున్నారని చెప్పారు. గతంలో వైద్యం చేయించుకోవాలంటే ఎన్నో ఇబ్బందులకు గురయ్యేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. 108, 104 సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిత్యం వైద్యం అందేలా సదుపాయాలను మెరుగుపరిచారని తెలిపారు. సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు అవసరమైన మందులు ఉచితంగా అందజేయడం గొప్ప విషయమన్నారు. గ్రామీణ ప్రజలకు సైతం ఆధునిక వైద్య సేవలందించడానికి విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించిందన్నారు. రోగుల వద్దకే వైద్యం అందేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. మరోసారి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్‌ఎంపీపీలు కన్నియప్ప, డిల్లీ, ఎంపీడీఓ లీలామాధవి, వైద్యాధికారి రమేష్, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ హరి, సర్పంచ్ బాలప్రసాద్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, పరశురాం, జగదీష్ రెడ్డి, ఎంపీడీఓ భానుమూర్తి, డాక్టర్ చక్రపాణి, సర్పంచ్ మునెమ్మ, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, పార్టీ కన్వీనర్ డి.సుబ్రమణ్యంరాజు, సచివాలయ కన్వీనర్ ఎం.సురేష్‌రాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్, నందయ్య, మునిబాబు, కిరణ్ పాల్గొన్నారు.


అత్తూరులో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ దీప

నిండ్రలో..

నిండ్ర: పేదల ఆరోగ్యానికి రక్షణగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిలుస్తోందని ఎంపీపీ దీప అన్నారు. గురువారం మండలంలోని అత్తూరు గ్రామంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో వైద్యసిబ్బంది 15 రోజుల పాటు ఆరోగ్య సర్వే చేసి ప్రజల వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు దుర్గాదేవి, శుభ, వైద్యాధికారి కల్యాణి, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ అమరేంద్రబాబు, సచివాలయ మండల కన్వీనర్ బాబురెడ్డి, మండల కన్వీనర్ వేణురాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యులు అనిల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దామోదరం, నాయకులు రమేష్, ఏలుమలై ఆచారి, దామురెడ్డి, మునిరాజ్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు శ్రీరామరక్ష


అర్హులకు కంటి అద్దాలు, మందులు పంపిణీ చేస్తున్న ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి


అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసి పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు


పాలసముద్రం: మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

వెదురుకుప్పం: జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు శ్రీరామరక్ష అని ఎంపీపీ నాగరాణి అన్నారు. గురువారం మండలంలోని మాంబేడు గ్రామ సచివాలయ పరిధిలోని ఆర్‌కేఎంపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఎంపీటీసీ గుణశేఖర్, నాయకులు రోశిరెడ్డి, గురవారెడ్డి, మాధవరావు, కేశవులు, పొన్నయ్య పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: సంపూర్ణ ఆరోగ్యమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని కొత్తపల్లి సచివాలయ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 49 కొత్తపల్లిమిట్ట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా రోగులకు సంపూర్ణ న్యాయం జరుగుతుందన్నారు. ప్రతి ఇంటినీ, ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ఇంటి గడప వద్దనే ప్రజలకు ఆరోగ్య సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, నాణ్యమైన వైద్యం అందించడం కోసం ప్రవేశపెట్టిన పథకం జగనన్న ఆరోగ్య సురక్ష అని అన్నారు. శిబిరంలో దాదాపు 52 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అర్హులకు కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ డిల్లయ్య, డీసీసీ బ్యాంకు డైరెక్టర్ బాలసుబ్రమణ్యం, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణయ్య, తహసీల్దారు లోకనాథపిళ్లై, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలోని చిన్నవేపంజేరి గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ శ్రీదేవి, తహసీల్దార్ ఇన్బనాథన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ లక్ష్మీప్రియ ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందిస్తున్న ఘనత సీఎం జగనన్నదే అన్నారు. అనంతరం రోగులకు వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఝాన్సీలక్ష్మి, ఎంపిటిసి రామచంద్రారెడ్డి, వైద్యాధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు హేమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని కలవకుంట సచివాలయ ఆవరణలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తహసీల్దార్ కళావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరం ఆవరణలో ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ చూపరులను ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు ఓ వరమని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, వైస్ ఎంపీపీలు శేఖర్ యాదవ్, పుష్ప తెలిపారు. గురువారం వెంగళరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సర్పంచ్ లిల్లీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మెడికల్ క్యాంపునకు వచ్చిన 271 మందికి వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అవకతవకలు లేకుండా పనులు చేపట్టండి


ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు గంగాభవానీ

పెనుమూరు (కార్వేటినగరం): ఉపాధిహామీ పనుల్లో అవకతవకలకు చోటు లేకుండా చూడాలని జిల్లా నీటి యాజమాన్యం సంస్థ పథకం సంచాలకులు గంగాభవాని అన్నారు. గురువారం మండల పరిధిలోని మోపిరెడ్డిపల్లి వద్ద జరుగుతున్న పంటకాలువ పూడిక పనులను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా సంచాలకులు మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పనులను నాణ్యతగా చేపట్టి రైతులకు ఉపయోగపడేలా చూడాలన్నారు. ఉపాధిహామీ పనుల కూలీలకు గిట్టిబాటు కల్పించాలని అధికారి కోరారు. అనంతరం చిప్పారపల్లిలో పండ్లతోటల పెంపకంలో భాగంగా సాగు చేస్తున్న మామిడి తోటను సందర్శించారు. కార్యక్రమంలో ఏపీఓ మీనాకుమారి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పలువురు పాల్గొన్నారు.

రికవరీకి ఆదేశం


మాట్లాడుతున్న ఎంపీపీ నాగరాణి

వెదురుకుప్పం: మండలంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన అభివృద్ధి పనుల్లో సామాజిక తనిఖీలో తేలిన అక్రమాలు రూ.11342లను రికవరీకి డ్వామా పీడీ గంగాభవానీ ఆదేశించారు. గురువారం వెదురుకుప్పంలో సామాజిక బహిరంగ సభ జరిగింది. అయితే మండలంలోని 25 గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ కింద రూ.83431791, పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.18444566, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో రూ.2791275, సమగ్రశిక్ష అభియాన్ ద్వారా రూ.141806 కాగా మొత్తం రూ. 104818663 వెచ్చించారు. వీటిపై ఇటీవల సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో జరిగిన పనులను పరిశీలించి నివేదిక సిద్ధం చేశారు. మొత్తానికి రూ.11342 తేడా రావడంతో రికవరీకి ఆదేశించారు. ఈసందర్భంగా ఎంపీపీ నాగరాణి మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న పనుల్లో అధికారులు పారదర్శకత వహించి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీవీఓ భాగ్యలక్ష్మి, ఏపీడీ శోభన్‌బాబు, ఎంపీడీఓ సుధాకరావు, ఏపీఓ ఇందు, ఎస్ఆర్పీ మీరావలి పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి


డ్వాక్రా మహిళలకు వివరిస్తున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

పాలసముద్రం: మండలంలోని వీఓఏలు తమ రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో సీఆర్‌పీ, సీసీఎస్, స్త్రీనిధి రికవరీ, ఆరోగ్య పోషణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్వాక్రా గ్రూపులకు, సిబ్బందికి రికార్డులు ఏ విధంగా రాయాలి ? స్త్రీనిధి రికవరీ ఏ విధంగా చేయాలి ? ఇంటి వద్ద పెరటి కోళ్లు, పెరటి తోటల పెంపు తదితర అంశాలపై వివరించారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఉద్దేశంతో డ్వాక్రా మహిళలకు పాడి పశువులు కొనుగోలు చేయడానికి వడ్డీ లేని రుణాలు, రూ.50 వేలు ఇస్తారని తెలిపారు. ఇంతవరకు ఉన్నతి, స్త్రీనిధి తీసుకోని సభ్యులు పాడిపశువులు రుణాలను కోసం సంఘమిత్ర వద్ద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, లోకనాథం, సంఘమిత్ర మురగయ్య, మంజుల, బాలయ్య, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

గ్యాస్ గోదాముల మూసివేత

తిరుమల: తిరుమలలోని బాలాజీనగర్ సమీపంలోని రింగ్ రోడ్డులో ఉన్న హెచ్‌పీ, ఇండేన్, భారత్ గ్యాస్ ఏజెన్సీల గోదాములను గురువారం టీటీడీ రెవెన్యూ అధికారులు మూసివేశారు. ఇందులో ఓ గ్యాస్ ఏజెన్సీ టీటీడీకి దాదాపు రూ.50 లక్షలకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. అంతేగాక తిరుమల భద్రత దృష్ట్యా గ్యాస్ ఏజెన్సీ గోదాములను తిరుమలలో ఉండరాదని టీటీడీ బోర్డు తీర్మానం చేసింది.